వజ్రమ్మ భౌతిక కాయం మెడికల్ కాలేజీకి అప్పగింత


వజ్రమ్మ (ఫైల్)

నిజాంపేట్, జూలై 27(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ ప్రగతినగర్ మాజీ సర్పంచ్ దుబ్బాక దయాకర్‌రెడ్డి తల్లి వజ్రమ్మ భౌతికకాయాన్ని కుటుంబసభ్యులు శనివారం మెడికల్ కాలేజీకి అప్పగించారు. వజ్రమ్మ శుక్రవారం సాయంత్రం మృతి చెందారు. దీంతో దుబ్బాక దయాకర్‌రెడ్డి, ఆయన సోదరి సరళ, కుటుంబసభ్యుల సమక్షంలో ఆమె భౌతికకాయాన్ని బాచుపల్లిలోని మమత మెడికల్ కాలేజీకి దానం చేశారు. మరణించిన తరువాత దేహాన్ని కాల్చి, పూడ్చడం కన్నా మెడికల్ కాలేజీకి ఇవ్వడం వల్ల ఎంతో మంది వైద్య విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని కళాశాల డీన్ హరికృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ నవీన్‌కుమార్ అన్నారు. ఈ సందర్భంగా వజ్రమ్మ కుటుంబసభ్యులు కళాశాల యాజమాన్యం, ఫ్యాకల్టీ అభినందించింది.


ఖాజాగూడలో రోడ్లను పరిశీలిస్తున్న జడ్సీ ఉపేందర్‌రెడ్డి

రోడ్డు విస్తరణ కోసం స్తంభాలు, చెట్లు తొలగించాలి

గచ్చిబౌలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోన్‌పరిధిలో రోడ్డు విస్తరణకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్లు తొలగించాలని జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం శేరిలింగంపల్లి, చందానగర్ సర్కిళ్ల పరిధిలో రోడ్డు విస్తరణ చేయనున్న ప్రాంతాలను అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆస్తుల సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. గచ్చిబౌలి మల్కంచెరువు, ఖాజాగూడ ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జోన్ పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఫ్రీ లెఫ్ట్‌లతో పాటు వాహదారులను విస్తరించాల్సిన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ స్తంభాలు రహదారులపై ఉన్నందున వాటిని పక్కకు మార్చే పనులు వేగవంతం చేయాలని ఆశాఖ అధికారులకు సూచించారు. పట్టణ ప్రణాళిక విభాగం, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలని, రోడ్డుకు అడ్డువచ్చిన చెట్లను సూక్ష్మ పద్ధతిలో తొలగించి ఇతర ప్రాంతాల్లో నాటాలన్నారు. జంట సర్కిళ్లలోని ప్రధాన కూడళ్లలో పచ్చదనంతో పాటు పరిశుభ్రత ఉండేలా చూడాలన్నారు.

ఎప్‌సెట్ రెండోవిడత కౌన్సెలింగ్ ప్రారంభం

హైదరాబాద్ సిటీ, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ (బీటెక్) కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్‌సెట్ రెండోవిడత కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం ప్రారంభమైంది. కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్న సుమారు 1,500 అభ్యర్థులు నగరంలో ఏర్పాటు చేసిన ఆరు హెల్ప్‌లైన్ కేంద్రాల్లో తమ ధ్రువపత్రాల పరిశీలనను పూర్తి చేసుకున్నారు. రెండోవిడతలో మరో 10వేలకు పైగా కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో కొత్తగా సీట్లను ప్రభుత్వం పెంచడంతో సీఎస్ఈ సీట్ల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ధ్రువపత్రాలు పరిశీలన పూర్తిచేసుకున్న అభ్యర్థులు తాము కోరుకున్న కాలేజీల్లో, తమకు నచ్చిన కోర్సును ఎంచుకునేందుకు ఆదివారంతో గడువు ముగుస్తుందని అధికారులు తెలిపారు. ఈ నెల 31న ప్రొవిజనల్ సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు.

కదులుతున్న కారులో మంటలు


మంటల్లో కాలిపోతున్న కారు

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ నుంచి కూకట్‌పల్లి వైపు వస్తున్న ఓ కారులో శుక్రవారం రాత్రి 10 గంటల సమయంలో మంటలు ఎగిసిపడ్డాయి. శంషాబాద్ నుంచి కూకట్‌పల్లికి కారు వస్తుండగా కైతలాపూర్ గ్రౌండ్ దగ్గరకు వచ్చే సరికి ఇంజన్ నుంచి పొగలు రావడంతో డ్రైవర్ అప్రమత్తమయ్యాడు. వెంటనే కస్టమర్‌ను కారు దిగమని చెప్పి బానెట్ పైకి లేపడంతో మంటలు చెలరేగాయి. కూకట్‌పల్లి పోలీసులకు సమాచారం అందడంతో అక్కడికి చేరుకుని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. పోలీసులు క్యాబ్ డ్రైవర్ సుధాకర్ నుంచి వివరాలు సేకరించారు.

ఫుట్‌పాత్‌పైకి లారీ.. భయంతో జనం పరుగులు


ఫుట్‌పాత్ ఎక్కిన లారీ

కేపీహెచ్‌బీకాలనీ, జూలై 27 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలో ఓ లారీ అదుపుతప్పి ఫుట్‌పాత్ ఎక్కింది. దీంతో ఆ మార్గంలో ప్రయాణించే వాహనదారులు భయభ్రాంతులకు గురయ్యారు. బీదర్ నుంచి చక్కెర లోడ్‌తో నగరంలో అన్‌లోడ్ చేసేందుకు శనివారం మధ్యాహ్నం 2 గంటల తర్వాత కూకట్‌పల్లి మెయిన్ రోడ్డు వివేకానందనగర్ సమీపంలోకి వచ్చాడు. ఈ క్రమంలో బ్రేకులు పని చేయకపోవడంతో డ్రైవర్ లారీ ఫుట్‌పాత్ ఎక్కించాడు. దీంతో అక్కడ ఏం జరుగుతుందో అర్థంకాక వాహనదారులు భయంతో దూరంగా జరిగారు. చివరకు ఎటువంటి ప్రమాదం జరగకుండా ఫుట్‌పాత్‌పై లారీ ఆగిపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ కొత్తపల్లి ముత్తు తెలిపారు.

ఇంటి నుంచి దుర్వాసన.. కుళ్లిన స్థితిలో మృతదేహం

పేట్‌బషీరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి మృతి చెంది ఇంటి నుంచి దుర్వాసన రావడంతో పక్కన ఉన్న ప్రజలు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. జీడిమెట్ల సీఐ మల్లేశం తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల రామారం డివిజన్ హెచ్‌ఏఎల్ కాలనీలోని డి.శ్రీనివాస్(52) పదేళ్లుగా ఒంటరిగా నివాసం ఉంటున్నాడు. చిన్నచిన్న పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు, మూడు రోజుల క్రితం శ్రీనివాస్ మద్యం తాగి నడవలేనిస్థితిలో ఇంట్లోకి వెళ్లాడు. శనివారం ఇంటి నుంచి దుర్వాసన వస్తుండడంతో గమనించిన స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. శ్రీనివాస్ అనారోగ్యంతోనే మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి చెల్లి సత్యప్రియ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొన్నారు.

తల్లి చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడిని తల్లికి అప్పగిస్తున్న పోలీసులు

గాజులరామారం, జూలై 27 (ఆంధ్రజ్యోతి): తప్పిపోయిన బాలుడిని జీడిమెట్ల పోలీసులు తల్లికి అప్పగించారు. ఒడిస్సాకు చెందిన బసంతి బతుకుదెరువు కోసం వలసవచ్చి సుభాష్‌నగర్, అపురూపకాలనీలో నివాసం ఉంటోంది. ఆమె కుమారుడు ఆయూష్(7) ఇంటి నుంచి తప్పిపోయి, అపురూపకాలనీ వీధుల్లో తిరుగుతుంటే గమణించిన స్థానికులు జీడిమెట్ల పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు బాబును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి తల్లిదండ్రుల గురించి తెలుసుకున్నారు. వెంటనే బాలుడిని తల్లికి అప్పగించారు.

అధిక లోడ్‌తో వెళ్తున్న వాహనాల సీజ్

పేట్‌బషీరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): దుండిగల్, గండిమైసమ్మ చౌరస్తాలో శుక్రవారం రాత్రి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ హైదరాబాద్ రూరల్ యూనిట్ గనులు, ఆర్‌టీఏ అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మోటారు వాహన చట్టం నిబంధనల ప్రకారం లేని 19 లారీలుపై కేసు నమోదు చేసి 12 లారీలను సీజ్ చేశారు. ఇసుక, ఇటుకలు పరిమితికి మించి లోడ్ తీసుకెళ్తున్న 10, పర్మిట్ లేని 3, ఫిట్‌నెస్ లేనివి 3, డ్రైవింగ్‌లైసెన్స్ లేనివి 3, పన్నులు చెల్లించని 1 లారీలను సీజ్‌చేసి దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. కంకర, ఇసుక తీసుకవెళ్తున్న 8 లారీలకు మైన్స్ అండ్ మినరల్ డెవలప్‌మెంట్ రెగ్యులేషన్ యాక్టు 1957 కింద రాయల్టీ కేసులు బుక్ చేసి 4,85,970 రూపాయలను జరిమానా విధించినట్లు అధికారులు తెలిపారు.


పట్టుబడిన లారీలతో అధికారులు


విద్యుత్ దీపాల వెలుగులో కూకట్‌పల్లిలోని చిత్తారమ్మ ఆలయం

బోనాలకు ఆలయాలు ముస్తాబు


కేపీహెచ్‌బీలో పోచమ్మతల్లి

(జోన్‌బృందం, ఆంధ్రజ్యోతి)
ఆషాఢమాసం చివరి ఆదివారం కావడంతో బోనాల వేడుకలకు అమ్మవారి ఆలయాలను సర్వాంగసుందరంగా అలంకరించారు. కేపీహెచ్‌బీ జేఎన్‌టీయూ రోడ్డులోని పోచమ్మతల్లి ఆలయంలో ఉత్సవాల కోసం ఏర్పాట్లు చేశారు.

- కూకట్‌పల్లి గ్రామంలోని చిత్తారమ్మ ఆలయంలో జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు.
- శేరిలింగంపల్లి నియోజకవర్గంలో మియాపూర్, మదీనగూడ, హఫీజ్‌పేట, కొండాపూర్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, లింగంపల్లి, బీహెచ్ఈఎల్, చందానగర్‌లో ప్రాంతాల్లోని అమ్మవారి ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు.


కొండాపూర్‌లోని ఓ పాఠశాలలో పోతరాజుల వేషధారణలో విద్యార్థులు



మూసాపేట్‌లోని ఓ స్కూల్‌లో నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు


శిల్పారామంలో కళాకారుల నృత్యప్రదర్శన

మాదాపూర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): వారంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం మాదాపూర్ శిల్పారామంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కాలిఫోర్నియా, యూఎస్ఏ నుంచి విచ్చేసిన తరణి కోవెల్లంపూడి తన ప్రదర్శనలో భాగంగా విఘ్నరాజం భజే, ఎందరో మహానుభావులు, కళింగ నర్తనం అంశాలపై చక్కటి ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. అనంతరం తరంగిణి కథక్ అకాడమి గురు శ్రీసుబ్రత్ సర్కార్ శిష్యబృందం తమ ప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు.

● ఆకట్టుకున్న అన్నమయ్య స్వరార్చన

మాదాపూర్‌లోని అన్నమయ్య భావనవాహినిలో శనివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నమయ్య స్వరార్చన కార్యక్రమం అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. మంచిర్యాల నుంచి శివప్రియ మ్యూజిక్ అకాడమి గురువు శివప్రియ శిష్యబృందం సంకీర్తనలను ఆలపించి అలరించారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

పేట్‌బషీరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): వాహనదారులు నిబంధనలు పాటించినపుడే ప్రమాదాలు తగ్గుతాయని మేడ్చల్ ట్రాఫిక్ ఏసీపీ వెంకట్‌రెడ్డి అన్నారు. అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రాంగ్‌రూట్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్‌ను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుచిత్ర కూడళ్లలో నిర్వహించిన డ్రైవ్‌లో రాంగ్ రూట్‌లో వాహనాలను నడుపుతున్న 25 మందిని అదుపులోకి తీసుకొని అల్వాల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు వాహనాలను తీసుకవచ్చారు. వీరందరికీ ఏసీపీ వెంకట్‌రెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. రాంగ్‌రూట్‌లో వచ్చిన వాహనదారుల తల్లిదండ్రులకు ఏసీపీ ఫోన్ చేసి సమస్యను తెలియజేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ నాగరాజు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యా వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తాం'

షాపూర్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): యూఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా నూతన కమిటీ శనివా రం ఎన్నుకున్నారు. జిల్లా పరిధిలోని ఉప్పల్‌లో మేధా కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో యూ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రవి, తిరుపతి పాల్గొని కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ కార్యదర్శిగా వెంకటేష్, అధ్యక్షుడిగా చంద్రకాంత్, ఉపాధ్యక్షుడిగా రాఖేష్, ఆఫీస్ బేరర్‌గా మధు, కమిటీ సభ్యునిగా గణేష్‌లను ఎన్నుకున్నారు. అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తామని తెలిపారు.

రాంనరేష్‌నగర్ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి


రాంనరేష్‌నగర్‌లో సమస్యలు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

హైదర్‌నగర్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు తెలిపారు. శనివారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైదర్‌నగర్ రాంనరేష్‌నగర్ కాలనీలో నెలకొన్న సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. దశలవారీగా అభివృద్ధి పనులు చేపడతామన్నారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నామని ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఈ రాజీవ్, వర్క్ఇన్‌స్పెక్టర్ మహదేవ్, ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహ, శానిటేషన్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన జిల్లా 320-ఎ గవర్నర్‌గా కోటేశ్వరరావు

నిజాంపేట్, జూలై 27 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్స్ అంతర్జాతీయ అధ్యక్షుడు పాట్రిసియో ఒలివేర దంపతులు హైదరాబాద్‌కు వచ్చిన సందర్భంగా వారి చిత్రపటాన్ని నాసిక ప్రముఖ చిత్రకారుడు సత్యఓలు రాంబాబు అందజేశారు. లయన్స్‌క్లబ్ నూతన జిల్లా 320-ఎ గవర్నర్ డి.కోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం కార్యక్రమంలో అంతర్జాతీయ అధ్యక్షుడు పాట్రిసియో ఒలివేర, ఆయన సతీమణి అమరిల్స్ ఒలివేర చిత్రపటాన్ని అందజేసినట్లు సత్యఓలు రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా వారు సత్యవోలు రాంబాబుని అభినందిస్తూ, ఆయన సేవలను ప్రశంసించారు.

బసవతారకనగర్ వాసులకు న్యాయం చేస్తాం


బసవతారక నగర్‌వాసులతో ఎమ్మెల్యేగాంధీ

గచ్చిబౌలి, జూలై 27 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని బసవతారక నగర్‌లో ఇళ్లు కోల్పోయిన వారికి తగిన న్యాయం జరిగేలా చూస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ హామీ ఇచ్చారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో సుమారు 30 మంది బాధితులు ఎమ్మెల్యేను శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోయిన బాధితులు, ఫ్లై ఓవర్ పనుల్లో ఆస్తులు కోల్పోయిన వారికి న్యాయం జరిగేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీని శాలువాతో సత్కరించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

హైదర్‌నగర్: శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు వైద్యచికిత్సల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు శనివారం అందజేశారు. అజిబెస్టాస్ కాలనీకి చెందిన స్వాతికి రూ.24,500, రాజశేఖర్‌రెడ్డికి రూ.21,000, పాపిరెడ్డినగర్ 18,000 చెక్కులు అందజేశారు.

కాలనీల్లో పేరుకుపోయిన చెత్త


షాపూర్‌నగర్ పీహెచ్‌సీ పక్కనే పేరుకుపోయిన చెత్త


షాపూర్ నగర్‌లో మూతలేని మ్యాన్‌హోల్

షాపూర్‌నగర్, జూలై 27(ఆంధ్రజ్యోతి): కురుస్తున్న వర్షాలు కారణంగా కాలనీలు, బస్తీలు చెత్తాచెదారంతో అస్తవ్యస్తంగా మారాయి. రోడ్ల వెంట, ఖాళీ ప్రదేశాల్లో చెత్త పేరుకు పోయింది. దానిని తొలగించకపోవడంతో వర్షాలకు విపరీతమైన దుర్వాసన వెలువడుతోంది. దీంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయి. షాపూర్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రి చుట్టుపక్కల ప్రాంతాల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. వర్షాలకు పలు కాలనీలో రోడ్లు అస్తవ్యస్తంగా మారడం, మ్యాన్‌హోల్స్‌పై మూతలు విరిగిపోయాయి. మూతలు లేని మ్యాన్‌హోల్ కారణంగా వాహనదారులు, పాదాచారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని స్థానికులు వాపోతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు, సిబ్బంది సకాలంలో స్పందించి చెత్తను తొలగించి, పగిలిపోయిన మ్యాన్‌హోల్ మూతలకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

అబ్దుల్ కలాం సేవలు మరువలేనివి


కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

పేట్‌బషీరాబాద్, జూలై 27(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా సూరారం కాలనీ బస్టాప్‌లో వెల్ఫేర్ అసోసియేషన్ సంఘం సభ్యులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలాం దేశానికి చేసినసేవలు మరువలేమని ఆ కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు అంజయ్యగౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు యాదయ్య యాదవ్, నరేందర్‌రెడ్డి, అంజనేయులు, పాండు, సలీమ్ పాల్గొన్నారు.

మిస్సైల్‌మ్యాన్‌కు శ్రద్ధాంజలి

● **హైదర్‌నగర్:** మిస్సైల్‌మ్యాన్ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. శనివారం అబ్దుల్‌కలాం వర్ధంతిని ఎల్లమ్మబండలో నిర్వహించారు. కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా హాజరై కలాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్ భాస్కర్, షౌకత్‌అలీమున్నా, సయ్యద్, జి.రవి, జగదీష్, పోశెట్టిగౌడ్, నాగేష్‌గౌడ్, రాజుగౌడ్, మహేష్, నజీర్, జనార్దన్, ఖలీమ్, అర్జున్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

పాశమైలారం విరూపాక్ష పరిశ్రమలో భారీ పేలుడు

● ఐదుగురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

పటాన్‌చెరు రూరల్, జూలై 27(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలోని విరూపాక్ష ఆర్గానిక్స్ పరిశ్రమలో శనివారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంలో ఐదుగురు గాయపడ్డారు. బాయిలర్ వద్ద భారీ పేలుడు చోటు చేసుకోవడంతో ముగ్గురికి తీవ్రంగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బీడీఎల్ భానూర్ సీఐ స్వామిగౌడ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పరిశ్రమలో రోజుమాదిరిగానే సిబ్బంది పని చేస్తున్నారు. అయితే బాయిలర్‌లో కాలిన బూడిద బయటకొచ్చే ప్రదేశం పక్కనున్న కెమికల్ డ్రమ్ములకు ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో డ్రమ్ములు పేలిపోయి మంటలు వ్యాపించాయి. అక్కడే విధులు నిర్వహిస్తున్న అనంతరెడ్డి, శ్రీకాంత్, హరప్రసాద్ తీవ్రంగా గాయపడ్డారు. మరో ఉద్యోగి దీపక్, పరిశ్రమ జీఎం రాజమౌళికి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని పటాన్‌చెరులోని ప్రైవేటు దవాఖానాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. అనంతరెడ్డి, శ్రీకాంత్ పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. పేలుడు తీవ్రతకు పరిశ్రమ పైకప్పు ధ్వంసమైంది. పాశమైలారం, పటాన్‌చెరు నుంచి ఫైర్ ఇంజన్లను రప్పించి మంటలను అదుపు చేశారు. పరిశ్రమ జీఎం రాజమౌళి మాట్లాడుతూ ఈ ఘటనలో నలుగురు ఉద్యోగులు గాయపడ్డారని చెప్పారు.